# పునఃప్రారంభంపై ఆశలు

- మూతబడిన మార్కెట్ సముదాయం
- కబ్జాదారుల కన్ను
- మళ్లీ ప్రారంభించాలని కోరుతున్న రైతులు
- వృథాగా లక్షల రూపాయల నిధులు



నిరుపయోగంగా మాల్ కూరగాయల మార్కెట్ సముదాయం

**యాచారం:** మాల్ కేంద్రంలో రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ ఎప్పుడు తెరుచుకుంటుందోనని రైతులు, వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. ఒకప్పుడు మాల్ కూరగాయల మార్కెట్ అంటే.. రంగారెడ్డి జిల్లాతో పాటు నల్గొండ జిల్లాలో ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ రైతులకు మెరుగైన ఆదాయం లభించడం తో పాటు వినియోగదారులకు చౌకగా తాజా కూరగాయలు అందుబాటులో ఉండేవి. రంగారెడ్డి జిల్లా యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మాడ్గుల, నల్లొండ జిల్లా మర్రిగూడ, చింతపల్లి, దేవరకొండ మండలాల నుంచి రైతులు, చిరువ్యాపారులు వచ్చి కూరగాయల క్రయ, విక్రయాలు జరిపేవారు. నిత్యం రూ.లక్షల్లో లావాదేవీలు జరిగేవి. ప్రతి ఏటా మాల్ పంచాయతీకి వేలం పాట ద్వారా రూ.లక్షల్లో ఆదాయం సమకూరేది. మార్కెట్ నిర్వహణ వలన వందలాది మంది వ్యాపారులు, కార్మికులు జీవనోపాధి పొందేవారు.

**రూ. 21 లక్షలు వృథా**

మాల్‌లో కూరగాయల క్రయ, విక్రయాలు జోరుగా సాగడంతో శాశ్వత దుకాణాలు నిర్మించాలని అధికారులు భావించారు. 2013లో మాల్‌లోని నల్లవెల్లి చౌరస్తాలో రూ. 21 లక్షల నిధులు ఖర్చు చేసి 15 దుకాణాలు నిర్మించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 21 లక్షలతో పాటు వ్యాపారులు నుంచి నిధులు సేకరించి దుకాణాలు నిర్మించారు. ఇక్కడ కూరగాయలతో పాటు చేపలు, చికెన్, మటన్ విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. అయితే ప్రారంభించిన ఏడాదిలోనే మార్కెట్ మూత పడింది. దీంతో మార్కెట్ స్థలంపై కబ్జాదారులు కన్నేశారని స్థానికులు చెబుతున్నారు.

**నల్గొండ జిల్లాకు తరలింపు**

మాల్ కూరగాయల మార్కెట్‌లో క్రయ, విక్రయాలు మందగించాయనే సాకుతో వ్యాపారులు నల్గొండ జిల్లా చింతపల్లి మండలం శ్రీ వేంకటేశ్వరనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. అయితే జిల్లాకు రావాల్సిన ఆదాయం నల్గొండ జిల్లాకు తరలిపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతోనే నిధులు వృథా అయ్యాయని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యమే..**



కూరగాయల మార్కెట్ మూత పడటానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం. దుకాణాలు తెరిపించాలని కోరినా స్పందించడం లేదు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. మార్కెట్ మూతపడడంతో పంచాయతీ ఆదాయాన్ని కోల్పోయింది. వ్యాపారులు, చిరువ్యాపారులు జీవనోపాధి కోల్పోతున్నారు. రైతులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

–పడకంటి కవిత, సర్పంచ్ మాల్

# ఆస్ట్రేలియాలో కాంగ్రెస్ సంబురాలు



ఆస్ట్రేలియాలో సంబురాలు జరుపుకొంటున్న ప్రవాస భారతీయులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం గర్వకారణమని ఆస్ట్రేలియా కాంగ్రెస్ ప్రవాస భారతీయుల సంఘం నాయకుడు కొమ్మిడి సంతోశ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ అధికారంలోకి రావడంతో ఆస్ట్రేలియాలో విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంతోశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ పాలనను అంతమొందించి ప్రజాపాలన తీసుకొచ్చారని కొనియాడారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ హవా

**ఇబ్రహీంపట్నం:** శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఇబ్రహీంపట్నం స్థానం నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మినహా అభ్యర్థులందరి డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఈ నియోజకవర్గం నుంచి 28 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలబడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి 1,26,506 ఓట్లు రాగా.. బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 89,806 ఓట్లు పోలయ్యాయి. సమీప అభ్యర్థిపై రంగారెడ్డి 36,700 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

**బీజేపీకి తగ్గిన ఓట్లు**

ప్రధాని మోదీ ప్రభావం, బీసీ ముఖ్యమంత్రి నినాదం నియోజకవర్గంలో పనిచేయలేదు. 2018 ఎన్నికల్లో బీజేపీకి 17 వేలు ఓట్లు పడ్డాయి. ఈ సారి ఆ పార్టీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్ 15,790 ఓట్లు రాబట్టారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటింగ్ శాతం తగ్గింది.

**ప్రభావం చూపని సీపీఎం**

ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్యకు 3,948 ఓట్ల మాత్రమే పడ్డాయి. 2018 ఎన్నికల్లో 9 వేలకు పైగా ఓట్లు సాధించిన ఆ పార్టీ.. ఈ సారి మరింత దిగజారిపోవడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. నియోజకవర్గంలో రోజురోజుకు సీపీఎంకు ఆదరణ తగ్గుతుండటం గమనార్హం.

**బీఎస్పీ విఫలం**

ఈ ఎన్నికల్లో బీఎస్పీ అసలు ప్రభావం చూపలేదు. 2,114 ఓట్లకే ఆ పార్టీ పరిమితమయింది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్టీ పగ్గాలు చేపట్టిన అనంతరం బీఎస్పీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని అందరూ భావించారు. ఓట్లు రాబట్టడంలో ఆ పార్టీ అభ్యర్థి గొరిగే మల్లేశ్ విఫలమయ్యారు.

## క్లుప్తంగా

### రేవంత్‌కు శుభాకాంక్షలు

**తలకొండపల్లి:** పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మహేశ్ శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం మండల పరిధిలోని చీపునుంతల్లో ఆయన మాట్లాడారు. పార్టీని గెలిపించేందుకు రేవంత్ రాష్ట్రవ్యాప్తంగా తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారని గుర్తుచేశారు.

### గీత కార్మికుడికి తీవ్రగాయాలు

**తలకొండపల్లి:** తాటి చెట్టు పైనుంచి పడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన రఘురాములుగౌడ్ ఆదివారం సాయంత్రం తాటి చెట్టు నుంచి కల్లు గీస్తుండగా కాలు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రఘురాములుగౌడ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

### ఫ్లై ఓవర్ నిర్మించండి

**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతి**



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న శశిధర్

**ఇబ్రహీంపట్నం:** హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై దండుమైలారం క్రాస్ రోడ్డు వద్ద ఫ్లై ఓవర్‌ను నిర్మించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వీహెచ్‌పీ రాష్ట్ర సహకార్యదర్శి రావినూతల శశిధర్ విన్నవించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఢిల్లీలో బీజేపీ మాజీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంతో కలిసి కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం శశిధర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై రద్దీ ఉండటంతో దండుమైలారం మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అందువల్ల ఫ్లై ఓవర్ నిర్మించాలని గడ్కరీని కోరామని చెప్పారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

### ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

**ఎంపీపీ సుకన్య**

**యాచారం:** అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయని, ఇప్పటి నుంచి అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల దృష్ట్యా అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు రెండు నెలలుగా విధుల్లో బిజీగా ఉన్నారని తెలిపారు. మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని కోరారు.

### హరహర మహాదేవ



శివ లింగానికి పూజలు చేస్తున్న భక్తులు

**మంచాల:** మండల పరిధిలోని ఆరుట్ల బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతాలు సోమవారం శివ నామ స్మరణతో మారుమోగాయి. వారం రోజులుగా కొనసాగుతున్న బుగ్గ రామలింగేశ్వరస్వామిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

### స్వాములకు సన్మానం



స్వాములను సన్మానిస్తున్న సర్పంచ్

**కడ్తాల్:** మండల పరిధిలోని గడ్డమీదితండా గ్రామ పంచాయతీకి చెందిన కిషన్, లచ్చిరామ్, పాండునాయక్, జగన్, పాండునాయక్ పాండునాయక్ 44 రోజుల క్రితం అయ్యప్ప మాల ధరించి, పాదయాత్ర ద్వారా శబరిమల యాత్ర పూర్తి చేసుకుని స్వగ్రామం చేరుకున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాండు నాయక్ ఆధ్వర్యంలో వీరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బన్సీ, పంత్యానాయక్, సురేశ్, నర్యా, శ్రీను, ప్రవీణ్, రమ్య, వినోద్, శ్రీను ఉన్నారు.

### సమష్టి విజయం

**బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్**

**తుక్కుగూడ:** అందరి సమష్టి కృషితో బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందారని బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్ అన్నారు. సోమవారం ఆయన రావిర్యాలలో విలేకరులతో మాట్లాడుతూ.. సబితారెడ్డి గెలుపునకు పని చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హోదాలో ఆమె నియోజకవర్గాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంతోనే ఓటర్లు మరోసారి ఆమెను ఆశీర్వదించారన్నారు.

# మల్‌రెడ్డి గెలుపు శుభపరిణామం



ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న కాంగ్రెస్ నాయకులు

**మంచాల:** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపొందడంతో సోమవారం ఆరుట్ల గ్రామంలో ఆ పార్టీ నాయకులు మొక్కలు తీర్చుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల భాషయ్య ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో 116 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి రావడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. పేదల కోసం పనిచేసే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎమ్మెల్యే గెలుపొందడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుంకరి పాండు, యాదయ్య, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, నాయకులు రమేశ్, జంగయ్య గౌడ్, అంతటి రాజు గౌడ్, ఎల్లేశ్ పాల్గొన్నారు.

**శుభాకాంక్షల వెల్లువ**

**తుర్కయంజాల్:** అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన మల్‌రెడ్డి రంగారెడ్డికి అభినందనల వెల్లువ కొనసాగుతోంది. తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన పలువురు నాయకులు సోమవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధన్‌రాజ్ గౌడ్ కూడా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోండి

**సీపీఐ నాయకుల డిమాండ్**




ఇబ్రహీంపట్నం: ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నేతలు

**ఇబ్రహీంపట్నం:** తమ నాయకుడిపై చేయి చేసుకున్న సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో ర్యాలీగా వెళ్లి.. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవీంద్రచారి, నర్సింహా, నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోస్టల్ బ్యాలెట్ బ్యాక్సులు తెరిచారని కాంగ్రెస్, సీపీఐ శనివారం నిరసన తెలుపుతుంటే.. స్థానిక సీఐ గోవింద్‌రెడ్డి, ఎస్ఐ నాగరాజు అకారణంగా తమ పార్టీకి చెందిన జంగిలి కృష్ణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. బీఆర్ఎస్‌కు తొత్తుగా వ్యవహరించిన పోలీస్ అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు హరిసింగ్‌నాయక్, లక్ష్మణ్, శివరాల లక్ష్మయ్య, శ్రీశైలం, నర్సింహ, సురేశ్, యాదయ్య, శ్రీ హరి పాల్గొన్నారు.

# నోటాకు తగ్గిన ఓటింగ్

**తుక్కుగూడ:** మహేశ్వరం నియోజకవర్గంలో 5,46,577 మంది ఓటర్లకు గాను నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో 55.33 శాతం పోలింగ్ నమోదయింది. ఈ ఎన్నికల్లో 2,033 మంది తమ ఓటును నోటాకు వేశారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 2,171 మంది నోటకు ఓటేశారు. గత ఎన్నికలతో పోల్చితే నోటాకు ఓట్లు తగ్గాయి.

## కమలానికి జైకొట్టిన తుక్కుగూడ

**తుక్కుగూడ:** అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆదివారం ఓట్ల లెక్కింపులో మంత్రి సబితారెడ్డి మరోసారి విజయం సాధించారు. ఆమెకు నియోజకవర్గ వ్యాప్తంగా ఆధిక్యం కనబరిచినా.. తుక్కుగూడ మున్సిపాలిటీ వాసులు బీజేపీకి లీడ్ ఇచ్చారు. బూత్ నెంబర్ 387 నుంచి 407వరకు బీజేపీకి 6,917, బీఆర్ఎస్‌కు 5,382, కాంగ్రెస్‌కు 2,770 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ కమలం అభ్యర్థి అందెల శ్రీనివాస్ 1,459 ఓట్ల ఆధిక్యతను కనబరిచారు.

## 20 మంది భక్తుల మాలధారణ



మాలధారణతో అయ్యప్ప భక్తులు

**పహాడీషరీఫ్:** మామిడిపల్లి బాల మణికంఠ అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం 20 మంది భక్తులు అయ్యప్ప స్వామి మాలధారణ స్వీకరించారు. ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్ రెడ్డి గురుస్వామి, జగన్మోహన్ రెడ్డి గురుస్వామి, కోట్ల రంగనాథ్ గురుస్వాముల పర్యవేక్షణలో కన్నె స్వాములు ప్రవీణ్, నాగభూషణం, రమేష్ తదితరులు మాల వేసుకున్నారు.



# ఆత్మరక్షణకు కరాటే దోహదం



ఆమనగల్లులో విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్ సోని

**ఆమనగల్లు:** ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఆమనగల్లు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి అన్నారు. విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కరాటే మాస్టర్ సోని ఆధ్వర్యంలో కరాటే శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం రామలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. ఆత్మరక్షణకు బాలికలు కరాటేపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా అమ్మాయిలపై జరుగుతున్న దాడులను ఎలా ఎదుర్కోవాలి.. విపత్కర పరిస్థితుల నుంచి ఎలా బయటపడాలి అనే విషయాలపై విద్యార్థినులకు మాస్టర్ సోని వివరించారు. ఉపాధ్యాయులు సుశీల, సుగుణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్‌మేళా



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు

**వనస్థలిపురం:** వనస్థలిపురంలో హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్)కు విశేష స్పందన లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు, ముత్యాలు తదితర వస్తువుల కొనుగోలుకు స్థానికుల నుంచి ఆదరణ బాగుందని నిర్వాహకులు అక్బర్ తెలిపారు.

# ఫలితాన్ని శాసించిన జల్‌పల్లి జనం

- మున్సిపల్ పరిధినుంచి బీఆర్ఎస్‌కు 15వేల లీడ్
- ద్వితీయ స్థానంలో కాంగ్రెస్
- శ్రీరాం కాలనీలో కమల వికాసం



సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

**పహాడీషరీఫ్:** హోరా హోరీగా కొనసాగిన ఎన్నికల సమరంలో నియోజకవర్గంలో తొలిసారి గులాబీ జెండా రెపరెపలాడింది. మున్సిపల్ ప్రజలు బీఆర్ఎస్‌కు భారీ ఆధిక్యాన్ని కట్టబెట్టారు. అందరూ ఊహించినట్లుగానే నియోజకవర్గ ఫలితాన్ని జల్‌పల్లి మున్సిపల్ వాసులే శాసిస్తారనే ఊహను నిజం చేశారు. 15వేల ఓట్ల మెజార్టీని ఇచ్చి సబితారెడ్డిని గెలిపించారు. ఇక్కడ దాదాపు 37 వేల ఓట్లు పోలైతే...అందులో బీఆర్ఎస్‌కు ఏకంగా 23 వేల ఓట్లు పోలయ్యాయి. 8,702 ఓట్లతో కాంగ్రెస్ ద్వితీయ స్థానానికి పరిమితం కాగా.. గెలుపుపై ధీమాగా ఉన్న బీజేపీ 4,706 ఓట్లకు పరిమితమైంది. ఇక్కడ బీఎస్పీ అభ్యర్థి కేఎంఆర్‌కు వంద ఓట్లు పోలయ్యాయి.

**45శాతం పోలింగ్**

మున్సిపల్ పరిధిలో దాదాపు 60వేల మైనార్టీ ఓటర్లున్నారు. మైనార్టీ బస్తీల్లో 45 శాతం వరకు పోలింగ్ నమోదవ్వగా 27వేల ఓట్లు పోలయ్యాయి. మజ్లిస్‌తో బీఆర్ఎస్‌కు స్నేహబంధం ఉండడం, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సైతం ఇక్కడ సభ పెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరడంతో ఎక్కువ శాతం బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపి దాదాపు 19వేల ఓట్ల వరకు వేశారు. ద్వితీయ ఆప్షన్ కింద ఎంచుకున్న కాంగ్రెస్ పార్టీకి 7వేల ఓట్లు పడగా.. సాధారణంగానే మైనార్టీలలో బీజేపీ పట్ల వ్యతిరేక భావం ఉన్న నేపథ్యంలో ఆ పార్టీకి 500 వరకు ఓట్లు పోలయ్యాయి. ఇతరులందరు కలిసి 120 వరకు మాత్రమే ఓట్లను దక్కించుకున్నారు.

**'కారు'కే ఆధిక్యం**

మున్సిపల్ పరిధిలోని కొత్తపేట గ్రామంలో 684, ఎర్రకుంటలో 2023, జల్‌పల్లిలో 340 ఓట్ల మెజార్టీ సాధించగా శ్రీరాం కాలనీలో బీజేపీ 781 ఓట్ల ఆధిక్యాన్ని కనబరిచింది. వాదే హుదా బస్తీలో 661, వాదే ముస్తఫా బస్తీలో 978, పహాడీషరీఫ్‌లో 2,203, క్యూబా కాలనీలో 576, హైవే హోటల్ పరిసర బస్తీల్లో 627, షాహీన్‌నగర్ ప్రధాన చౌరస్తా ప్రాంతంలో 655, అలైన్, బిస్మిల్లా కాలనీలు, వీబీపీ స్కూల్ ప్రాంతంలో 1833 ఓట్లు బీఆర్ఎస్ లీడ్ చూపింది. బిస్మిల్లా కాలనీ, ఉస్మాన్‌నగర్, వాదే సాలై హీన్ బస్తీల్లో 2,218 ఓట్లతో కారుకు మెజార్టీ ఇచ్చారు.

## ఎక్కడ పడితే అక్కడ చెత్త

**హస్తినాపురం:** ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని అనేక ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తపేరుకుపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హస్తినాపురం, వనస్థలిపురం, చంపాపేట్, లింగోజిగూడ డివిజన్లపరిధిలో జీహెచ్ఎంసీ సర్కిల్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యం మూలంగా క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడంలేని దీనితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యపనులు సక్రమంగా జరిగేవిదంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రమాదకరంగా పైపులు



రోడ్డుకు అడ్డంగా వేసిన పైపులు

**హయత్‌నగర్:** హయత్‌నగర్‌లోని తొర్రూర్ వైపు వెళ్లే పాతరోడ్డులో నడిరోడ్డుపై వదిలేసిన పైపులు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై గొయ్యి ఏర్పడడంతో రెండు నెలల క్రితం ఇక్కడ డ్రైనేజీ ట్రంకులైను పైపులను తొలగించి కొత్తగా పైపులు వేశారు. ఈ క్రమంలో భూమిలో నుంచి తొలగించిన పైపులను రోడ్డుకు ఓ వైపున పడేశారు. పనులు పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా అక్కడినుంచి పైపులను తొలగించలేదు. పైపులను తొలగించకపోవడంతో వాహనాలు వాటిని ఢీ కొట్టే ప్రమాదం ఉంది. రోజూ వేల కొద్దీ వాహనాలు వెళ్లే ఈ రోడ్డుపై పైపులను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైపులు రోడ్డుపై ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.